# మూగగది

కొబ్బరి చెట్టునీడ ఏటవాలుగా పడేచోట ఆడుకుంటున్న పావురాల్ని చూస్తున్నాను. నాకు పావురాలంటే చాలా ఇష్టం. నా ఎనిమిదవ పుట్టినరోజునాడు శ్రీకాంత్ రెండు పావురాల్ని బహుమతిగా ఇచ్చాడు. శ్రీకాంత్ వాళ్లు మా ప్రక్క పోర్షన్‌లో వుండేవాళ్లు. నాకంటే వయస్సులో మూడేళ్లు పెద్ద. ఒకే స్కూల్‌లో చదువుకునేవాళ్లం.

శ్రీకాంత్ పావురాలు ఇవ్వగానే ఇద్దరం మా వీధి చివరనున్న సుబ్బిశెట్టిని అడిగి ప్యాకేజ్ డబ్బా తెచ్చి దానితో వాటికో గూడుని కట్టాం. రాగులు, సజ్జలు తెచ్చి వేసి చిన్ని గిన్నెతో నీళ్లు పట్టాం. అవి మెడ తిప్పినా, రెక్కలు విదిలించినా, నీళ్లు తాగినా, ఎగురుతున్నా నాకు ఆనందమే. స్కూల్‌కి వెళుతున్నప్పుడు, వస్తున్నప్పుడు శ్రీకాంత్‌కి పావురాల ప్రతి కదలిక వివరించి చెప్పేదాన్ని.

"నాకంటే నీకు అవే ఎక్కువైపోయాయి. ఎప్పుడూ వాటితోనే ఆట. వాటి గురించే కబుర్లు" అన్నాడు ఉక్రోషంగా.

"అవి నువ్విచ్చినవేగా?" అన్నాను నవ్వుతూ.

"అందుకే ఊరుకున్నాను. అదే ఆ బాబ్జిగాడో, మున్నానో ఇచ్చినవైతే నీపని చెప్పేవాడిని" అన్నాడు క్షమిస్తున్నట్టు.

స్త్రీని క్షమించటం, ఔదార్యం ప్రకటించటం మగవాడు జన్మహక్కు అనుకుంటాడను కుంటాను.

ఓరోజు స్కూల్ వదిలే సమయానికి ఆకాశమంతా నల్లని మేఘాలు. పాత స్నేహితుడి జ్ఞాపకంలా చల్లని చిరుగాలి.

"నడు" అన్నాడు శ్రీకాంత్.

"పర్లేదు" అంటూ నా చెయ్యి పట్టుకొని రమ్మన్నట్టు లాగాడు. అసలు నా భయమంతా వర్షంలో తడవాల్సి వస్తుందని కాదు.

ఉరుములు!

ఉరుములంటే నాకు చాలా భయం.

నల్లని ఆకాశంలో ఓ వజ్రాల రేఖలా ఓ సన్నని గీత ఏర్పడటం ఎంతో అద్భుతంగా వుంటుంది. కాని వెంటనే చెవులు చిల్లులు పడేలా వచ్చే ఆ ఉరుములంటే నాకు చాలా భయం.

"నేనున్నానుగా!" అన్నాడు అభయమిస్తున్నట్టు.

'నేనున్నాను' అనే అభయం స్త్రీకి ఇవ్వగలిగేతే హృదయం పురుషుడికి స్వతస్సిద్ధంగా వస్తుందా? సమాజం యిచ్చిందా?

ఇద్దరం కొద్ది దూరం వెళ్లామో లేదో "టపటప" చినుకులు మొదలయ్యాయి. మట్టివాసన మధురంగా నాసికకు తగులుతోంది.

"వర్షం వస్తుంది శ్రీ. ఆ చెట్టుకింద నిలబడదాం" అన్నాను భయం భయంగా.

"పిరికి పిల్లా, కమాన్. రన్" నా చెయ్యి పట్టుకొని పరుగెడుతూ అన్నాడు. ఆరోజు ఉరుములు లేవు. వానలో ఆడి, పాడి ఇంటికి వెళితే అమ్మ చెడామడా వాయించింది. వసారాలో వో మూల కూర్చుని ఏడుస్తున్న నా దగ్గరికి వచ్చి తనింట్లోకి తీసుకెళ్లి ఏదో తెచ్చి కందిపోయిన నా బుగ్గలపై రాసి - "మందు రాసానుగా ఇంక నొప్పి పోతుందిలే" అన్నాడు.

వేసవి సెలవులు వస్తే తాటి తోపులు, మామిడి తోపులన్నీ మావే! శ్రీకాంత్‌కి మామిడి కాయల దొంగతనమంటే చాలా ఇష్టం. కాలవ గట్టున నన్ను కూర్చోమని ఈ చివరి నుండి ఆ చివరికి ఈది కలువపూలు తెచ్చి ఇచ్చేవాడు. బెల్ లేని తన పాత సైకిల్‌పై ఎక్కించుకొని ఊరంతా తిప్పేవాడు.

నా పదమూడేళ్ల వయస్సప్పుడు శ్రీకాంత్ వాళ్లు ట్రాన్స్‌ఫర్ అయి వూరు విడిచి మరో వూరు వెళ్లిపోయారు.

ఆ తర్వాత శ్రీకాంత్ వివరాలు నాకేం తెలియలేదు.

కాని అతడిచ్చిన జ్ఞాపకాలు, పావురాలు నాలో పదిలంగా వున్నాయి. ముఖ్యంగా అతడి క్రింది పెదవిపై చిన్ని పుట్టుమచ్చ నాకు బాగా గుర్తుండిపోయింది. పావురాల్ని వదిలి లోపలికి రాబోతుంటే "విమలా" అని వినిస్తే వెనక్కి చూశాను.

ఓ యువకుడు నిలబడి వున్నాడు.

క్రింది పెదవిపై చిన్ని పుట్టుమచ్చ - శ్రీకాంత్!

"బాగున్నావా?" ఆప్యాయంగా అడిగాడు.

జీవితం ప్రారంభం కాకముందే అంతానికి చేరువయ్యే అనుభవాలు స్త్రీకి సొంతం చేసే యువకులున్న ఈ సమాజంలో బాల్యంలో నీవిచ్చిన మధురమైన స్నేహం మనసుకెంతో

ఆనందాన్ని, ధైర్యాన్ని ఇస్తుంటే బాగున్నాను నేస్తం అనుకున్నాను మనసులో.

శ్రీకాంత్ ఉద్యోగం చేస్తున్నది ఈవూర్లోనే కాబట్టి తరచుగా వస్తుండేవాడు. నాకు మాట్లాడే అవకాశమే ఇవ్వకుండా హాయిగా కబుర్లు చెప్పేవాడు. ఓ రోజు సాయంత్రపు నీరెండలో ఆడుకుంటున్న పావురాల్ని చూస్తూ నూతిగట్టు చప్టాపై కూర్చుని కర్చీఫ్‌పై మిగిలిపోయిన ఎంబ్రాయిడరీ వర్క్ చేస్తుంటే శ్రీకాంత్ వచ్చాడు.

"ఇంకా ఆ పావురాల్ని పెంచుతున్నావా?" అన్నాడు.

"ఆ.....! అవి నువ్విచ్చిన పావురాల సంతతే" అన్నాను.

"పావురాల్ని ప్రెజంట్ చేసానని గుర్తొస్తే నాకు భలే నవ్వొస్తుంది. స్నేహితురాలి పుట్టిన రోజుకి ఎవరైనా పిట్టల్ని, పువ్వుల్ని ప్రెజంట్ చేస్తారా?" అన్నాడు.

"మరేం ఇస్తారు?" నవ్వుతూ అడిగాను.

"కిస్"

అదిరిపోయాను. అతడి ముఖంలోకి పరీక్షగా చూశాను. ఎప్పటిలా నిర్మలంగానే వుంది. నేననవసరంగా ఉలిక్కిపడ్డానా? స్నేహభావంతోనే అన్నాడేమో?

ఒక్కటి మాత్రం నిజం. శ్రీకాంత్‌లో మార్పు వచ్చింది. ఒకనాడు ఎంతో అపురూపంగా తోచిన విషయాలన్నీ అతడికీనాడు చాలా అల్పంగా తోస్తున్నాయి.

"ఏమిటోయ్ నీ టైమ్ అంతా ఇలా పావురాలకి, ఎంబ్రాయిడరీలు చెయ్యడానికీ వేస్ట్ చేస్తావా?" అన్నాడు నవ్వుతూ.

"ఇది నీ కోసమే. నీ పుట్టినరోజుగా. నేను ఎంబ్రాయిడరీ చేసిన కర్చీఫ్ అంటే నీకు ఇష్టం కదా?" అన్నాను.

"ఏంటీ నా బర్త్‌డే గిఫ్ట్ కర్చీఫ్‌తో సరిపెడతావా? భలేదానివే అంతకంటే అపురూపమైనవి చాలా వున్నాయి. అవి కావాలి" అన్నాడు.

"ఏమున్నాయి?" నవ్వుతూ అడిగాను.

"చాలా చాలా వున్నాయి" అంటూ నాకు చేరువగా వచ్చి తన రెండు చేతుల్లోకి నా ముఖాన్ని తీసుకొని నుదుటిపై అధరాలు అద్దబోతుంటే నేను కుడుతున్న సూది నా వేలికి గుచ్చుకోగానే బాధతో "అబ్బా!" అన్నాను.

"ఏమైంది" అంటూ అతను నన్ను వదిలి నా వేలిలో గుచ్చుకున్న సూదిని తీసి రక్తం కారుతున్న నా చేతి వేలిని నోట్లో పెట్టుకోబోతుంటే చటుక్కున వెనక్కి లాగేశాను.

"నేనేగా, చెయ్యి లాక్కుంటావేం?" ఆశ్చర్యంగా అడిగాడు.

"నువ్వు నాకు చిన్నప్పుడు తెలిసిన శ్రీకాంత్‌వి కాదు. నీ మనసులో ఇప్పుడు నాపై ఏ భావం వుందో తెల్సి కూడా అమాయకంగా నా చేతిని నీకు అందించలేను. నీలో అటువంటి భావం లేకపోతే నా వేలిని నీ నోట్లో పెట్టుకున్నా, నా తలని నీ ఒడిలో చేర్చి ఓదార్చినా నాకు అభ్యంతరం లేదు" అన్నాను.

"అదేంటి. చిన్నప్పుడు చేతులు చేతులు పట్టుకొని పరిగెత్తాం. నీ బుగ్గలని ఎన్నోసార్లు

స్పృశించాను. కాలు కాలు తగిలినా, భుజాలచుట్టూ చేతులేసినా ఏం అనేదానివి కాదుగా? ఇప్పుడేంటి అభ్యంతరం. జస్ట్ ఫర్ ఎంజాయిమెంట్" చాలా తేలిగ్గా అన్నాడు.

"నీ ...కు ... నీ...కు... ఇటువంటి భావం ఎలా వచ్చింది?" ఆశ్చర్యంగా అడిగాను.

"చిన్నప్పటి నుండి చనువుగా వుండి ఇలాంటి అభిప్రాయం కలిగించింది నువ్వే...."

"నేనా?" మరింత ఆశ్చర్యంగా అడిగాను.

"ఆ నువ్వే" ఖచ్చితంగా అన్నాడు శ్రీకాంత్.

నాకు విపరీతంగా శ్రీకాంత్‌పై జాలేసింది. నిజానికి ఆ జాలి శ్రీకాంత్‌పై కాదు. మగవాళ్లపై. చాలామంది మగవాళ్లు ఇలాగే వుంటారు. వాళ్ల ప్రవర్తనకి, సంకుచిత భావాలకి కారణం స్త్రీపై అవలీలగా నెట్టేస్తారు.

అతను నన్ను ఇలా కోరినందుకు నాకేం బాధ లేదు. కాని నేను "నో" అన్నానని పట్టుదలగా నాతో "యస్" అనిపించాలని నన్ను వదలకుండా ఓ ఆరు నెలలు సతాయించి చివరికి "మగవాడికి ఇటువంటి ఆసక్తి కలిగించి చివరివరకు లాగి, ఆఖరు క్షణంలో పతివ్రతల్లా ఫోజ్ కొట్టే నీలాంటివాళ్లంటే నాకు అసహ్యం" అన్నాడు.

చిన్ననాటి స్నేహానికి రంగులు పూసి ఏవేవో ఊహించుకొని మరేవో ఆశించి అందక పోయేసరికి అంతవరకు పరమ పవిత్రంగా, లలితంగా కనిపించిన నీ స్నేహితురాలు అసహ్యం అయిపోయిందా?

"అసలెందుకు ఒప్పుకోవు? నేను నీకు చిన్నప్పటినుండి తెలిసిన వాడినేగా?" అన్నాడో రోజు.

"తెలిస్తే?"

"సెక్యూరిటీ వున్నట్టేగా"

"దేనికి సెక్యూరిటీ?" అతనేం అంటున్నాడో అర్థంకాక అడిగాను.

"పరిచయమైన పది నిమిషాలలో ఎవరైనా నిన్నిలా అడిగితే నువ్వు తిరస్కరించవచ్చు. అపరిచిత యువకుడితో ఎక్కడికైనా వెళ్లాలన్నా, చొరవ చూపించాలన్నా భయంగా వుంటుంది. అతడు సాడిస్ట్ అయితే నిన్ను ఎంజాయ్‌చేసి చంపెయ్యచ్చు. ఇదంతా షూట్ చేసి బ్లూ ఫిల్మ్‌గా ఎవరికైనా ఇవ్వవచ్చు. ఫోటోస్ తీసి నిన్ను బ్లాక్‌మెయిల్ చెయ్యవచ్చు. నీకేదైనా ఇన్‌ఫెక్షన్ వచ్చినా, నువ్వు ప్రెగ్నెంట్ అయినా నిన్ను ఏం పట్టించుకోకుండా నాకేం తెలియదనొచ్చు. పెళ్లి చేసుకోమని సతాయించొచ్చు. ఇలా ఎన్నో సంఘటనలు జరిగినట్టు మనం వింటుంటాం. అదే బాగా తెలిసినవాళ్లతో అయితే ఇటువంటి సమస్యలేం వుండవు. నేనెవరికీ చెప్పను. నాకంటే నీకు సెక్యూరిటీ ఈ విషయంలో ఎవరివ్వగలరు? ప్లీజ్ ఏక్సెప్ట్ ఇట్" అర్థింపుగా అన్నాడతను.

నేను తెల్లబోయాను.

స్త్రీ పురుషుడిని ఆమోదించటానికి సెక్యూరిటీ వుంటే చాలా? ఎన్ని యుగాలు జరగాలి? ఎన్ని తరాలు మారాలి? పురుషుడికి స్త్రీ అర్థం కావాలంటే ఏ కలం పురి విప్పాలి?

"నాక్కావల్సింది సెక్యూరిటీ కాదు. చిన్ననాటి భావాలపై స్వాతివాన కురిపిస్తా వనుకున్నాను. కాని ఇలా ఉరుములు, పిడుగులు నిండిన వడగళ్ల వానని వెదజల్లుతావనుకోలేదు" అన్నాను.

"నీకేం కావాలి? నన్ను నువ్వు ఆమోదించాలంటే నీకేం కావాలో చెప్పు. ఇస్తాను" అన్నాడు పట్టుదలగా.

"ఇస్తావా?" అడిగాను.

"ఇస్తే ఆమోదిస్తావా?" అన్నాడు ఆత్రంగా.

"ఆ...!"

"అడుగు"

"స్పందన".

అతడు తెల్లబోయి వెనక్కి తిరిగి వెళ్లిపోయాడు.

నాకు నిశ్చయంగా తెలుసు. ఎంత తపించినా, జపించినా అతడు నన్నీ జన్మలో స్పందింప చేయలేడు. మీకెప్పుడైనా చిన్ననాటి నేస్తాలు ఎదురై శ్రీకాంత్‌లా ప్రవర్తిస్తే జాలిపడండి. అంతేకాని ఆ పసితనపు వేకువలో వికసించిన స్మృతిరేకులని నిర్దాక్షిణ్యంగా నలిపేయకండి.

*• స్రవంతి వారపత్రిక, 6, ఏప్రిల్ 1989 •*